14/4/91 247

కథ

ఎదురుగా ‘టులెట్’ బోర్డు చూడగానే మా ఇద్దరికీ ప్రాణం లేచొచ్చినట్టయింది. గాంధీనగర్‌లో ఇల్లు ఒకటి ఖాళీగా వుందని ఆఫీసులో చెప్తే గంటనుంచీ వెతుకుతున్నాం. చివరికి మా శ్రమ ఫలించింది.

‘‘అమ్మయ్య ఇల్లు దొరికింది విమలా!’’ జానకి సంతోషపడిపోయింది.

‘‘అప్పుడే అలా అనుకుని తృప్తిపడ బోకు... చివరికి ఈ ఇల్లెలా వుంటుందో!’’ అన్నాను చుట్టూ పరిసరాలు చూస్తూ.

‘‘అదీ నిజమేననుకో! కానీ ఇల్లు పైకి చూడడానికి మాత్రం చాలా బాగుంది!’’ అంటూ జానకి గేటు తీసింది.

ఇద్దరం లోపలికి రెండు అడుగులు వేశామో లేదో చిన్న సైజు తోడేలులాంటి కుక్క ఎక్కడినుంచి వచ్చిందో ‘బౌ’ మంటూ మీదికి ఉరకబోయింది.

ఈ హఠాత్సంఘటనకు భయపడిపోయి ఇద్దరం కెవ్వున అరిచాం. ఆ సమయంలో తెలీలేదు గాని, మేం ఎంత బిగ్గరగా అరిచామంటే మా అరుపుకు అంత పెద్ద కుక్కా బిక్కచచ్చిపోయి మా వేపు వెర్రిగా చూడసాగింది. ఇక ఆ ఇంట్లో వున్న జనాభా అంతా గాబరాగా బయటకు వచ్చేశారు.

‘‘ఏమయిందండీ!’’ అంటూ ఏ ఖూనీ జరిగిందోనన్నంత కంగారుపడిపోతూ అడగసాగారు.

మేం కొంచెం సిగ్గుపడి- ‘‘అబ్బే ఏం లేదండీ...’’ అంటూ ఎదురుగా వున్న కుక్కవేపు చూపించాము.

‘‘ఓ అదా సంగతి...’’ వాళ్ళల్లోని చిన్న పిల్ల ఫక్కున నవ్వేసింది.

‘‘ఇంతకీ మీరెవరు?’’ అడిగిందొకావిడ.

‘‘మేం ఆ బోర్డు చూసి వచ్చాం!’’ అంటూ టులెట్ బోర్డు చూపించాను.

‘‘ఓ అద్దె ఇంటికోసమా!’’ తేలిగ్గా తీసి పారేసింది.

ఇప్పటికే ఇళ్ళ వేటలో ఎన్నో అనుభవాలు పొంది రాటుతేలిపోయాం కాబట్టి ఆవిడ వెటకారాన్ని మేం పట్టించుకోలేదు.

‘‘అద్దెకిచ్చే పోర్షను చూపిస్తారా?’’ అన్నానావిడను చూస్తూ! ఆవిడ విసుక్కున్నట్టుగా మొహం పెట్టింది.

‘‘ఇంతకీ ఇక్కడ కాపరం చేసేది ఎవరు? నువ్వా, ఈ అమ్మాయా!’’ అంటూ నడుంపై చెయ్యి వేసుకుని మా ఇద్దరినీ పరీక్షగా చూడసాగింది. ఆవిడ మాటతీరుకు మనస్సు చివుక్కుమన్నా అవసరం మాది కాబట్టి ఇద్దరం కోపాన్ని అణచుకున్నాం.

‘‘నా పేరు విమల. ఈమె నా ఫ్రెండు జానకి. మేమిద్దరం ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాం. ఇప్పుడు ఇల్లు కావలసింది ఈమెకి...’’ అని చెప్పాను ఓపిగ్గా!

‘‘అలాగా... అయితే ఈ ఇంట్లో ఎందరుంటారు?’’ ఇల్లు చూపించకుండానే గేటు దగ్గర నిలబెట్టేసి ప్రశ్న పరంపరలు కురిపిస్తొంటే మండెక్కిపోయింది! ఈసారి కోపాన్ని అణచుకోలేదు.

‘‘చూడండి... ముందు మాకు ఇల్లు చూపించండి! అది మాకు నచ్చాక ఇక మీరెన్ని ప్రశ్నలు వేసినా ఓపిగ్గా సమాధానం చెప్తాం’’ అన్నాను.

ఆవిడ నావేపు గుర్రుగా చూసి విసవిసా లోపలికెళ్ళి తాళంచెవి తెచ్చి ఇల్లు చూపించింది.

మూడు గదుల ఇల్లు విశాలంగానే వుంది.

‘‘అద్దె ఎంతండీ’’ జానకి అడిగింది.

‘‘ఏడొందలు- కరెంట్ చార్జి అదనం...’’ అందావిడ.

‘‘అంటే మొత్తం దాదాపు ఎనిమిదొందలా...’’ ఆశ్చర్యపోయాను.

‘‘ఎందుకంత ఆశ్చర్యం! వెయ్యి రూపాయలిస్తామంటూ రోజూ ఎంతోమంది వచ్చిపోతున్నారు. కాని మాకు డబ్బు ముఖ్యం కాదమ్మాయ్. కాస్త మంచివాళ్ళకు ఇవ్వాలనీ...’’ అంటూ వ్యాపార ఫక్కీలో మాట్లాడసాగింది.

ఇల్లంతా మరోసారి చూశాం. ఇల్లు బాగానే వుంది కాని, అద్దె చాలా ఎక్కువ... ఎంత కడగాలా అని ఆలోచిస్తుండగా...

‘‘ఇంట్లో ఎంతమంది వుంటారు?’’

‘‘ముగ్గురం... అంటే నేను, మా వారు... మూడేళ్ళ పాప! మా వారు ప్రస్తుతం వేరే వూర్లో ఉద్యోగం చేస్తున్నారు. త్వరలోనే ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ అవుతుంది. ఇప్పుడుండేది మేమిద్దరమే...’’ గత అనుభవాల్తో గబగబా చెప్పేసింది జానకి.

‘‘సరే... బాగానే వుంది. ఇక మా కండిషన్లు వినండి- ‘‘గోడలకు మేకులు కొట్టరాదు...’’ అంటూ మొదలెట్టి పది పన్నెండు జాగ్రత్తలు చెప్పింది. ‘‘ఇంకో విషయం మూడునెల్ల అద్దె అడ్వాన్సుగా ఇవ్వాలి...’’ అంది.



‘‘మూడు నెలలా... ఇదెక్కడా వినలేదే!’’ అన్నాను. ‘‘అందరి సంగతీ నాకెందుకు! మా ఇంటి పద్ధతి ఇది! ఇంకో విషయం మీ ముగ్గురు తప్ప ఇంట్లో ఇంకెవ్వరూ రెండు- మూడు రోజులకంటే ఎక్కువ వుండకూడదు!’’ అంది జానకిని చూస్తూ!

ఆ మాట వినగానే నాకు ఒళ్ళు మండిపోయింది. ‘‘అదేమిటండీ... ఇటువంటి మంచి ఇల్లు దొరికాక మా జానకి వాళ్ళ అత్తగారిని, మామగారిని తీసుకురావాలనుకుంటోంది. పాపం... అసలే వాళ్ళిద్దరూ మంచంలోంచి లేవలేనివాళ్ళు...’’ కొంచెం జాలిగా అన్నాను.

వెంటనే ఆవిడ ముఖ కవళికలు మారిపోయాయి.

‘‘అలాగా... ఇంకా నయం... ముందే చెప్పారు. అటువంటి రోగిష్టివాళ్ళు నా ఇంట్లో వుండడానికి వీల్లేదు’’ అంది ఖచ్చితంగా.

‘‘రోగిష్టివాళ్ళు ఈ ఇంట్లో వుండకూడదా! అయితే మీకేమీ రోగాలు రావా! మీరు మంచాన పడకుండానే వుంటారా...’’ బయటికి నడుస్తూ అన్నాను కోపంగా!

ఆ తర్వాత పరిణామం ఎలా వుంటుందో తెలుసు కాబట్టి జానకి చేతిని పట్టుకుని గబగబా గేటుదాటి వచ్చేశాను.

‘‘విమలా! ఆమెకు బాగా బుద్ధిచెప్పావే!’’ జానకి మెచ్చికోలుగా చూసింది.

‘‘జానకీ! మాది స్వంత ఇల్లవడం వల్ల అద్దె ఇళ్ళ కష్టాలు తెలీలేదే! ఇప్పుడు నీతో వచ్చి ఇలా ఇళ్ళ వేటలో తిరగడం వల్ల దీన్లో వుండే సాధక బాధకాలు తెలుస్తున్నాయే... ఒక్కొక్కళ్ళను చూస్తుంటే వీళ్ళ ఇళ్ళ యజమానులా లేక నియంతలా అనిపిస్తోంది. అద్దె వందల్లో వసూలుచేస్తారు! పైగా వూరికే ఇస్తున్నట్టు దబాయింపు...’’

జానకి నాచీ చూసుకుంటూ రోడ్డు మీద పోతున్న ఖాళీ ఆటోని పిలిచింది- ‘‘విమలా రావే ఇక పోదాం...’’

‘‘అయితే ఇక ఇవ్వాల్టికి ఇళ్ళ వేట ముగిసినట్టేనా’’ అన్నాను ఆటోలో కూర్చుంటూ.

‘‘ఆ ముగిసినట్టే... అప్పుడే ఏడవుతోంది పాప ఎంత ఏడుస్తోందో!’’

జానకి ఆలోచనలు కూతురివేపు మళ్ళినట్టున్నాయి మౌనంగా కూర్చుంది. పావు గంట తర్వాత మా ఇంటి దగ్గర దిగిపోతూ-

‘‘రేపు ఆఫీసులో కలుద్దాం జానకీ, గుడ్‌బై...’’ అని మా ఇంటివైపు నడిచాను!

మర్నాడు నేను ఆఫీసుకొచ్చేసరికి జానకి ఎవరితోనో మాట్లాడుతోంది! నన్ను చూసి ‘‘విమలా! ఒక్కసారి ఇలా రా!’’ అని పిలిచింది.

‘‘ఈమె నా ఫ్రెండ్ విమల’’ అని నన్ను పరిచయం చేసి ‘‘విమలా! ఈయన మన లాటివాళ్ళకు అద్దె ఇళ్ళు చూసి పెడుతుంటారుట...’’ అంది. ఆయనవేపు చూశాను! సుమారు నలభై ఏళ్ళుంటాయి లావుగా- పొట్టిగా వున్నాడు. ముఖం చాలా సాత్వికంగా వుంది.

‘‘మీకు ఎటువంటి ఇల్లు కావాలో చెప్పారు కదా! నేను రేపట్నుంచీ అదే పనిలో వుంటాను... కానీ...’’ నసిగాడు.

ఆఫీసుల్లో పనిచేస్తున్న మాకు ఇటువంటి నసుగుడు వెనకాల గల భావం వెంటనే అర్థం అయింది. జానకి పర్సులోనుంచి వంద రూపాయిల నోటు తీసిచ్చింది. ‘‘ప్రస్తుతానికిది వుంచండి’’ అంది.

ఆయన లేచి జానక్కి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

‘‘ఈయనెక్కడ దొరికాడే?’’ అన్నాను.

‘‘మన సూపర్నెంటుగారు తీసుకొచ్చారే!’’

‘‘ఇటువంటి బ్రోకర్లు రెండువేపులా బాగా గుంజుతారు. వీళ్ళకి ఒక పట్టాన తృప్తి కలగదే!’’

‘‘ఫర్వాలేదులే! డబ్బు తీసుకుంటే తీసుకున్నాడు! మంచి ఇల్లు దొరికితే అంతే చాలు! అబ్బ! నెలరోజుల్నించీ ఇళ్ళకోసం తిరిగి తిరిగి నేసారిపోయాం!’’ అంది కుర్చీలో వెనక్కి వాలి.

‘‘ఈయన నిజంగా ఇల్లు చూసి పెడతాడంటావా!’’ ఆయన్ని చూస్తుంటే పనిచేసి పెట్టే రకంలా అనిపించడం లేదు.

‘‘లోగడ చాలామందికి వెతికి పెట్టాడుట. ఆయన పుణ్యమా అని మంచి ఇల్లు దొరికితే...’’ చెంపకు చెయ్యి చేర్చుకుని వూహాలోకంలోకి వెళ్ళిపోయింది జానకి.

జానకినలా ఊహల్లో వదిలేసి నేను నా సీటులోకి వచ్చేశాను.

* * *

మరో వారం గడిచింది.

ఆ బ్రోకరుగారు జానకి దగ్గరనుంచి మరో రెండు వందలు ఖర్చులకని అడిగి తీసుకెళ్ళాడు. ఈ విషయం తెలిసి జానకిని మందలించాను.

‘‘ఏం చెయ్యనే! నాకా ఇల్లు చాలా అవసరం. ఇల్లు దొరికేవరకు మనశ్శాంతి లేదనుకో!’’ జానకి నిట్టూరుస్తూ అంది.

‘‘నేనొక మాట చెప్పనా!’’

‘‘ఏమిటది?’’

‘‘జానకీ! నీకెలాగూ రెండొందల గజాల స్థలం వుంది కదా! దాన్లో నాలుగు గదుల ఇల్లు వేసుకోరాదూ!’’

‘‘సరేలే! ఆ స్థలానికి చేసిన అప్పే ఇంకా తీరలేదు. ఇల్లు కూడానా! ప్చ్... ఈ జన్మలో మాకా అదృష్టం లేదులే...’’

‘‘ఎప్పుడూ బీద అరుపులేనా... ఇద్దరు సంపాదిస్తున్నారు!’’

‘‘ఆ పేరుకు ఇద్దరి సంపాదన... కానీ అన్ని కటింగులూ పోను మా ఇద్దరికీ చేతికొచ్చేది చాలా తక్కువ. ఇక దాన్లోనే మా అత్తగారికి పంపాలి. మిగిలింది బొటాబొటీగా మాకు సరిపోతుంది. వాళ్ళను కూడా ఇక్కడకు తీసుకొచ్చామంటే మాకు కొంత సులువుగా వుంటుంది. అందుకే మంచి ఇల్లు కోసం చూస్తున్నా!’’

‘‘మీ అత్తగారు, మామగారు బాగా ఆరోగ్యంగా వుంటారు కనుక నీకు, నీ పాపకు సహాయంగా వుంటారు...’’

‘‘అవును విమలా! వాళ్ళని మా దగ్గరే వుంచుకోవాలని వుందే’’ అంటూ ఫక్కున నవ్వి --విమలా! మొన్న వాళ్ళిద్దరూ రోగిష్టి వాళ్ళని చెప్పి ఆ ఇంటావిడని బాగా హడల గొట్టావే...’’ అంటూ నవ్వసాగింది.

‘‘అటువంటి సంస్కారహీనులకు అప్పుడప్పుడు కాస్త షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలి. లేకపోతే వాళ్ళ అహంకారం పెచ్చుపెరిగి పోతుంది...’’

‘‘అన్నట్టు నువ్వు ఢిల్లీ వెళ్ళేది రేపే కదూ! మళ్ళీ ఎప్పుడూ రాక!’’ అంది జానకి.

‘‘పదిహేను రోజులు పడుతుందేమో! మెడికల్ లీవు పెట్టాను. మా ఫాదర్‌కి హార్ట్ ఆపరేషన్ కదా! ఆయన కొంచెం కోలుకున్నాక వస్తాను’’ అన్నాను.

ఆ తర్వాత మా సంభాషణ హృద్రోగాల మీదకు మళ్ళింది. మరో పావుగంట కూర్చుని వచ్చేశాను.

* * *

ఢిల్లీలో నాన్నగారికి ఆపరేషన్ జరిగి ఆయన కోలుకునేసరికి నెల రోజులుపట్టింది. లీవ్ ఎక్స్టెండ్ చేసి నెలా పది రోజుల తర్వాత ఆఫీసులో అడుగు పెట్టాను.

రాగానే నా కళ్ళు ఆత్రంగా జానకి కోసం వెతికాయి. ‘‘ఏమండోయ్ విమలగారూ! మీ ఫ్రెండుగారు ఇల్లు కట్టుకున్నారు తెలుసా!’’ సూపర్నెంటు పలకరించాడు.

ఒక్కసారి ఆశ్చర్యానందాలతో వుక్కిరి బిక్కిరయ్యాను.

‘‘నిజంగానా!’’

‘‘అవునండీ! కానీ గృహప్రవేశానికి మమ్మల్నెవర్నీ పిలవలేదు. అందుకే ఆ ఇల్లు చూసే అదృష్టం మాకు కలగలేదు’’ నిష్ఠూరంగా అన్నాడు.

ఆ మాట వినగానే నాలో ఎన్నో సందేహాలు కలిగాయి. సాయంత్రం వరకు ఎలాగో ఓపికపట్టి ఆఫీసునుంచి సరాసరి ఆటో చేసుకుని జానకి కొన్న స్థలం దగ్గరకెళ్ళాను.

చుట్టూ ప్రహరీ గోడ. గేటు తీసుకుని లోపలికెళ్ళాను. ఎదురుగా చిన్న పాక. దాన్ని చూడగానే మరింత ఆశ్చర్యం కలిగింది.

జానకి బయట కుర్చీలో కూర్చుని పాపతో ఆడుకుంటోంది. నన్ను చూసి నవ్వుతూ ఆహ్వానించింది. కుశల ప్రశ్నలయ్యాక...

ఇంటిని పరిశీలనగా చూస్తూ ‘‘జానకీ ఏమిటే ఇది!’’ అన్నాను.

‘‘ఏం చెయ్యమంటావే! ఎక్కడా ఇల్లు దొరకలేదు.’’

‘‘బ్రోకరుగారు ఏమయ్యారు?’’

‘‘ఒకరోజు వచ్చి అర్జెంటుగా అయిదొందలు కావాలని తీసుకుని మళ్ళా కనబడకుండా పోయాడు. ఇక నాకు విసుగెత్తిపోయింది. నా గొలుసు తాకట్టు పెట్టి ఆ డబ్బుతో ఇది వేసుకున్నాం. అబ్బ! ఇప్పుడు ప్రాణానికి ఎంతో హాయిగా వుందే!’’

జానకి చేసిన పనికి మెచ్చుకోకుండా వుండలేకపోయాను.

‘‘మామగారిని, అత్తగారిని తీసుకురావడానికి వెళ్ళారాయన...’’ జానకి అంది.

‘‘అలాగా... మొక్కలు కూడా పెట్టావే...’’ హఠాత్తుగా నా దృష్టి గోడ ప్రక్కగా వున్న కర్రలు, తాటాకులపై పడింది.

‘‘అవెందుకు?’’ అనడిగాను.

‘‘ఇదుగో... ఇందుకు...’’ అంటూ ప్రక్కన క్రిందపెట్టి వున్న ‘టులెట్’ బోర్డు చూపించింది.

నేను తెల్లబోయి చూశాను.

‘‘దాని క్రింద చదువు, అద్దె కుండే వాళ్ళకు ఎన్ని కండిషన్లు పెట్టానో...’’ గర్వంగా అంది జానకి.

‘‘అయితే... నువ్వు కూడా ఆ లిస్టులో చేరిపోయావా!’’

‘‘అవును. నేను కూడా ప్రస్తుతం ఇంటి యజమానురాలినే కదా...’’ అంటూ నవ్వసాగింది.